
సాక్షి
కృష్ణాజిల్లా
ఆదివారం। 12। జనవరి। 2025



హెల్మెట్ వాడకం తప్పనిసరి

విజయవాడస్పోర్ట్స్: ద్విచక్ర వాహనం నడిపే వారు హెల్మెట్ తప్పక ధరించాలని సీపీ రాజశేఖరబాబు సూచించారు. ఏఆర్ గ్రౌండ్స్‌లో శనివారం జరిగిన సంక్రాంతి సంబరాల్లో ఆయన మాట్లాడారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 565.20 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకు 9,800 క్యూసెక్కులు విడుదలవుతోంది.



సంక్రాంతి సంబరాలు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): స్థానిక పీబీ సిద్ధార్థ కళాశాల మైదానంలో శనివారం సంక్రాంతి సంబరాలు జరిగాయి. విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణతో అలరించారు.

సంక్రాంతి లేని వ్యాపారం

భారీగా పడిపోయిన పండగ వ్యాపారాలు

- గత సంక్రాంతితో పోల్చితే 50 శాతం వరకు తగ్గుదల
- ప్రభుత్వ చేయూత లేక ప్రజల్లో తగ్గిన కొనుగోలు శక్తి
- వైఎస్సార్ సీపీ హయాంలో డీబీటీ ద్వారా ప్రజలకు అందిన నగదు
- ఎన్నికల హామీలను విస్మరించిన కూటమి సర్కారు
- సంక్షేమ పథకాలు అమలుకాక ప్రజలకు అందని నగదు



మచిలీపట్నంలో కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్న వస్త్ర దుకాణం

సాక్షి, మచిలీపట్నం/చిలకలపూడి (మచిలీపట్నం): ముత్యాల ముగ్గులాంటి పండగ సంక్రాంతి. కుటుంబ సమేతంగా జరుపుకొనేందుకు ఇతర ప్రాంతాలు, దేశ విదేశాల్లో ఉన్న వారు సైతం సొంతూరికి వస్తారు. ఆడపడుచులు, కొత్త అల్లుళ్లు వచ్చేస్తారు. కంచం నిండా పిండి వంటలు వడ్డించి మంచీ మర్యాద చేయాలని ప్రతి ఒక్కరూ అనుకుంటారు. పండగ సంబరాలతో చేసుకునేందుకు కొత్త దుస్తులు, కిరాణా, బంగారు నగలు, ఎలక్ట్రానిక్స్, మిఠాయిలు, పండ్లు, ఇతర వస్తువుల కొనుగోలుకు షాపింగ్ చేద్దామంటే ఈ ఏడాది పర్సు ఖాళీగా కనిపిస్తోంది. గత ఏడాదితో పోల్చితే ప్రజల్లో కొనుగోలు శక్తి బాగా తగ్గి వ్యాపారాలు కుదేలయ్యాయి. జిల్లాలో అన్ని రకాల వ్యాపారాలు 30 నుంచి 50 శాతం వరకు పడిపోయాయి. చేతిలో డబ్బులేక, ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాల రూపంలో ఆర్థిక సాయం అందక ఈ సంక్రాంతికి వ్యాపారాలు కళ తప్పాయని వ్యాపారులు పేర్కొంటున్నారు.

నాడు కళకళల సంక్రాంతి

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో అనేక సంక్షేమ పథకాలు అమలయ్యాయి. అమ్మ ఒడి, ఆసరా, చేయూత, చేదోడు, విద్యా దీవెన, వసతి దీవెన, ఇన్‌పుట్ సబ్సిడీ, రైతు భరోసా, వడ్డీ మాఫీ, ఆసరా, వాహనమిత్ర పథకాలతో పాటు వివిధ రంగాలు, ఆయా సామాజికవర్గాలకు చెందిన వారు ఆర్థికంగా ఎదిగేందుకు సంక్షేమ పథకాలను తెచ్చి, నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లోనే నగదు జమ చేశారు. ఐదేళ్లలో 23,69,274 మంది బ్యాంక్ ఖాతాల్లోకి రూ.7,940.06 కోట్లు నేరుగా జమ చేశారు. ఆ నగదును ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదిగేవారు. ప్రజల చేతిలో నగదు ఉండటంతో వ్యాపారాలు జోరుగా సాగేవి. కూటమిగా జత కట్టిన చంద్రబాబు ఎన్నికల్లో సూపర్ సిక్స్ హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చారు. ఆ హామీల అమలును విస్మరించారు. కూటమి ప్రభుత్వ పాలనతో 50 శాతం వరకు బిజినెస్ తగ్గిందని వ్యాపారులు పేర్కొంటున్నారు.



కొనేందుకు జనం రాకపోవడంతో ఖాళీగా ఉన్న ఎలక్ట్రానిక్స్ షాప్



కొనుగోలుదారులు లేని స్వీట్స్ షాపు



ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు జంధ్యాల వీరలంకమ్మ. మచిలీపట్నంలోని పరాసుపేట సెంటర్‌లో పండ్ల వ్యాపారం చేస్తారు. 30 ఏళ్లుగా తోపుడు బండిపై వ్యాపారం చేస్తుంటారు. ఆరు నెలలుగా వ్యాపారం సగానికి పైగా పడిపోవడంతో రోజువారి కూలి కూడా మిగలడం లేదు. పైగా కొన్నిసార్లు వ్యాపారం జరగక నష్టాలు మిగులుగతున్నాయి. గతంలో రూ.100 వెచ్చించి పండ్లు కొనేవారు ఇప్పుడు రూ.50కి మించి ఖర్చు చేయడం లేదని, అప్పుడప్పుడు కొనేవారు ఇప్పుడు అసలు కొనడం లేదని, నష్టాల కారణంగా అప్పులు మిగిలాయని వీరలంకమ్మ వాపోయింది.

పడిపోయిన జీఎస్టీ వసూళ్లు

జిల్లాలో 70 వేల మంది వరకు వ్యాపారులు ఉన్నారు. అత్యధికంగా కిరాణా, గృహోపకరణాలు, వస్త్ర, బంగారు, రోల్డ్ గోల్డ్, చెప్పులు, ఎలక్ట్రానిక్స్, మొబైల్ తదితర దుకాణాలు ఉన్నాయి. ఎనిమిది వేల మంది వరకు వాణిజ్య పన్నుల శాఖలో నమోదవగా, 25 శాతం చాంబర్ ఆఫ్ కామర్స్‌లో సభ్యత్వం కలిగి ఉన్నారు. వారు కాకుండా మరో 30 వేల మంది చిరు వ్యాపారులు ఉన్నారని అంచనా. గతంలో జిల్లాలో ప్రతి నెలా రూ.600 కోట్ల వరకు వ్యాపారం జరిగేది. ఐదారు నెలల నుంచి రూ.400 కోట్లలో జరుగుతోందని చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు తెలిపారు. సంక్షేమ పథకాల అమలు లేకపోడంతో ప్రజల చేతిలో డబ్బు ఉండడం లేదని, దీంతో వ్యాపారాలు కుదేలయ్యాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. వ్యాపారాలు పడిపోవడంతో జీఎస్టీ వసూలు కావడం లేదని, నెలవారీ లక్ష్యం చేరకపోడంతో పాటు మైనస్‌లో ఉన్నామని కమర్షియల్ ట్యాక్స్ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

వ్యాపారాలు 50 శాతం తగ్గాయి



గత ఏడాదితో పోల్చితే వ్యాపారాలు 50 శాతం తగ్గాయి. కిరాణా, ఇతర సరుకులు కొనేందుకు జనం ఆసక్తి చూపడం లేదు. వారి వద్ద డబ్బు లేకపోవడం ప్రధాన కారణం. పెద్ద పెద్ద మాల్స్ రావడం, ఆన్‌లైన్ వ్యాపారం వైపు ఆకర్షితులు కావడం కూడా కారణంగా తెలుస్తోంది.

– జూపూడి అశోక్ బాబు, కిరాణా వ్యాపారి

అరకొరగా వ్యాపారాలు



వ్యాపారాలు కొన్ని నెలలుగా అరకొరగానే సాగుతున్నాయి. గతంలో పండగ వస్తుందని హడావిడి వచ్చి కొత్త టీవీ, ఫ్రిజ్, కూలర్లు, మొబైల్స్, ఇతర వస్తువులు కొనుగోలు చేసేవారు. కానీ ఏ ఏడాది స్తబ్దుగా ఉంది. 25 శాతానికి పైగా వ్యాపారం తగ్గింది. వ్యాపార సంస్థల పెరుగుదల కూడా కారణమే.

– పి.మణికంఠ, ఎలక్ట్రానిక్స్ వస్తువులు వ్యాపారి

నగలు కొనేవారు తగ్గారు



జనవరిలో ప్రజలు సంతోషంగా జరుపుకొనే పండగ సంక్రాంతి. ఈ పండగకు బంగారు నగలు కొనేందుకు మహిళలు ఆసక్తి చూపేవారు. ఈ ఏడాది చిన్న నగలు తప్ప పెద్ద ఆభరణాలు కొనేవారు లేరు. పథకాల సొమ్ము రాక చేతిలో డబ్బు లేదని ప్రజలు చెబుతున్నారు. దీంతో 80 శాతం వ్యాపారం తగ్గింది.

– యర్రా శ్రీనివాసకుమార్, అధ్యక్షుడు, మచిలీపట్నం బులియన్ జ్యూవెలరీ, డైమండ్ మర్చంట్స్ అసోసియేషన్

పండగ సందడి లేదు



సంక్రాంతికి పిండి వంటలు, స్వీట్స్‌కు ప్రాధాన్యమిస్తారు. అందరికీ ఇంట్లో చేసుకునేందుకు వీలు పడదు. కొన్నేళ్లుగా మిఠాయి వ్యాపారం చేస్తున్నాం. ఏటా సంక్రాంతికి రద్దీగా ఉంటే మా షాపులో ఈ ఏడాది వ్యాపారం బాగా తగ్గింది.

– శిర్విశెట్టి అంజనేయులు, మిఠాయి వ్యాపారి

న్యూస్‌రీల్

స్వాతంత్య్ర ఉద్యమంలో ఓబన్నది కీలకపాత్ర



చిలకలపూడి(మచిలీపట్నం): దేశ స్వాతంత్య్ర ఉద్యమంలో వడ్డే ఓబన్న కీలకపాత్ర పోషించారని జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి ఎం.ఫణిదూర్జటి అన్నారు. వెనుకబడి తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో స్వాతంత్య్ర సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. తొలుత ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఫణిదూర్జటి మాట్లాడుతూ.. వడ్డే ఓబన్న మొదటి తరం స్వాతంత్య్ర సమరయోధుడని పేర్కొన్నారు. స్వాతంత్య్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వద్ద ఓబన్న సైనిక అధ్యక్షుడిగా పనిచేస్తూ రైతులపై బ్రిటీష్ వారు విధించిన పన్నులకు వ్యతిరేకంగా 1845వ సంవత్సరంలో పోరాటం చేశారని వివరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ సీహెచ్ వీరాంజనేయప్రసాద్, వడ్డెర సంఘ నేతలు వేముల దుర్గారావు, కొంచెపు రాజేష్, శివరాత్రి నాగరాజు, బత్తుల దుర్గారావు, బోసు దుర్గారావు, బత్తుల రామకృష్ణ, గుంజా దుర్గారావు, కుంచెపు రాజు తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

చిలకలపూడి(మచిలీపట్నం): కోడిపందేలు నిర్వహించటం నేరమని, ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ డి.కె.బాలాజీ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జిల్లాలో ఎక్కడా కోడిపందేలు జరగకుండా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ గేమింగ్ యాక్ట్, జంతు హింస నివారణ చట్టం ప్రకారం కోడిపందేలను నిషేధించారని పేర్కొన్నారు. హైకోర్టు మార్గదర్శకాల మేరకు అన్ని స్థాయిల్లో తనిఖీ బృందాలను ఏర్పాటు చేశామని, ఇవి స్థానిక ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి చట్టాల్లోని అంశాలను వివరిస్తాయని తెలిపారు. జిల్లాలో ఎక్కడా బరులు ఏర్పాటవకుండా క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎక్కడైనా కోడిపందేలు నిర్వహిస్తే ఆయా డివిజన్ల పరిధిలోని రెవెన్యూ డివిజన్ల అధికారులు, డీఎస్పీలు, పశుసంవర్ధకశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ నెల 11 నుంచి 18వ తేదీ వరకు భారతీయ నాగరిక సురక్ష సంహిత సెక్షన్ అమలులో ఉంటుందని కలెక్టర్ బాలాజీ తెలిపారు.

చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే చర్యలు



కోనేరుసెంటరు(మచిలీపట్నం): సంక్రాంతికి ఎవరైనా చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఆర్.గంగాధరరావు హెచ్చరించారు. సంప్రదాయం అంటూ జీవహింసకు పాల్పడినా, జూదం ఆడిన కఠిన చర్యలు తప్పవన్నారు. పండుగను సంప్రదాయ పద్ధతిలో జరుపుకోవాలని సూచించారు. కోడి పందేలు, గుండాట, పేకాట వంటి జూద క్రీడలు పూర్తి నిషిద్ధమన్నారు. గతంలో అటువంటి క్రీడలు నిర్వహించిన వారిపై నిఘా ఉంచామన్నారు. వారికి నోటీసులు జారీ చేసి ముందస్తు చర్యల్లో భాగంగా బైండోవర్ చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా కోడిపందేల బరులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిస్తే తక్షణమే డయల్ 112కు లేదా 94910 68906 వాట్సాప్ నంబరుకు సమాచారం అందించాలని కోరారు. జిల్లాలోని పోలీసు కుటుంబాలకు, ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

కీసర టోల్‌ప్లాజా వద్ద పండగ సందడి



కంచికచర్ల: తెలుగుదనం ఉట్టిపడేలా సంక్రాంతిని జరుపుకొనేందుకు తెలంగాణ, మహారాష్ట్ర, కర్నాటక తదితర రాష్ట్రాల్లో నివసించే ఏపీ ప్రజలు కార్లు, ఇతర వాహనాల్లో సొంతూర్లకు బయలుదేరారు. దీంతో కంచికచర్ల మండలంలోని కీసర టోల్‌ప్లాజా వద్ద శనివారం వాహనాలు భారీగా బారులు తీరాయి. వాహనదారుల సౌలభ్యం కోసం ప్లాజా నిర్వాహకులు ఐదు కౌంటర్లు ఏర్పాటు చేశారు. దీనికి తోడు ఫాస్టాగ్ సిస్టం ఏర్పాటు చేయటం వాహనాల రాకపోకలకు సులభతరంగా మారింది. శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం రాత్రి పది గంటల వరకు 45 వేల వాహనాలు హైదరాబాద్ వైపు నుంచి విజయవాడ వైపు వెళ్లాయని ప్లాజా మేనేజర్ జయ ప్రకాష్ తెలిపారు.

మెరుగైన వైద్య సేవలే ప్రభుత్వ లక్ష్యం

మంత్రి కొల్లు రవీంద్ర



నూతన వైద్య పరికరాలను ప్రారంభిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల

మచిలీపట్నంటౌన్: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించటమే ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో అధునాతన వైద్య పరికరాలను సమకూరుస్తున్నామని గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో రూ.2 కోట్ల విలువైన అధునాతన అల్ట్రాసౌండ్, సీఆర్ఎం ఆంత్రోస్కోపిక్ వైద్య పరీక్షల యూనిట్‌లను ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావుతో కలిసి ఆయన శనివారం ప్రారంభించారు. వైద్య పరికరాల పనితీరును పరిశీలించి వైద్యాధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మంత్రి రవీంద్ర మాట్లాడుతూ.. రోగుల సౌకర్యార్థం మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి రూ.2 కోట్ల విలువైన అధునాతన వైద్య పరికరాలను మంజూరు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయా వైద్య పరికరాలను నిర్వహించేందుకు అవసరమైన నిపుణులు, వైద్యులను ఏర్పాటు చేసేందుకు త్వరలో చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ఆస్పత్రిలో ప్రస్తుతం యూరాలజీ, న్యూరాలజీ, యూరో సర్జరీ వంటి వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, భవిష్యత్తులో కీళ్ల మార్పిడి, కార్డియాలజీ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు. పోలాటితిప్ప, కోన, పల్లెతుమ్మలపాలెం ప్రాంతాల్లో ఒకటి, సుల్తానగరం లేదా అరిసేపల్లి ప్రాంతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డి.ఆశాలత, డెప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ జి.భానుమూర్తి, ఆర్ఎంఓ డాక్టర్ నిరంజన్‌కుమార్, రేడియాలజిస్ట్ డాక్టర్ వినీల్, ఆర్థోపెడీషియన్లు డాక్టర్ బి.శ్రీనివాస్, డాక్టర్ హరీష్, ఇతర వైద్యులు మాధురి, కళ్యాణ్, వైద్య సిబ్బంది జేఎస్పీ నాయకుడు బండి రామకృష్ణ పాల్గొన్నారు.

కొలికపూడిపై హత్యాయత్నం కేసు పెట్టాలి



ఆస్పత్రిలో చంటిని పరామర్శిస్తున్న దేవినేని అవినాష్, మల్లాది విష్ణు

వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అవినాష్, మాజీ ఎమ్మెల్యే విష్ణు

లబ్బీపేట(విజయవాడతూర్పు): కూటమి ఎమ్మెల్యేలు రౌడీల్లా వ్యవహరిస్తున్నారని, ప్రైవేటు పంచాయితీల్లో ఇళ్ల మీదకు వెళ్లి దాడులకు తెగబడుతున్నారని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు విమర్శించారు. తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఎ.కొండూరు మండలం గోపాలపురం వార్డు సభ్యురాలు, గిరిజన మహిళ భూక్యా చంటి ఇంటికి వెళ్లి ఆమెపై దాడి చేశారు. ఈ అవమానంతో పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన చంటి విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమెను శనివారం రాత్రి అవినాష్, విష్ణు పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం దేవినేని అవినాష్ మీడియాతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో దాడులు, అరాచకాలు పెరిగాయన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేసేలా దాడులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. దాడులకు భయపడేది లేదని, ప్రతి కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని స్పష్టంచేశారు. కూటమి ప్రభుత్వంలో రైతులు, వ్యాపారులు ఇలా అన్ని వర్గాలపై దాడులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. గిరిజన మహిళ ఆత్మహత్యాయత్నానికి కారణమైన ఎమ్మెల్యే కొలికపూడిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రౌడీ రాజ్యం నడుస్తోందని మల్లాది విష్ణు విమర్శించారు. ఎమ్మెల్యేలు రౌడీల్లా వ్యవహరిస్తున్నారని, దళితులు, బడుగు బలహీనవర్గాలు, ఎస్టీలపై దాడులు చేయడం హేయమని పేర్కొన్నారు. తిరువూరు ఎమ్మెల్యేపై ఆ పార్టీ వారే తిరుగుబాటు చేసిన ఘటనలు అందరికీ గుర్తున్నాయన్నారు. దాడులను ఉపేక్షించేది లేదని, ప్రత్యక్ష ఆందోళనకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ ఘటనపై పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. బాధితురాలికి మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరినట్లు తెలిపారు.

కవిత్వం సమాజాన్ని జాగృతం చేయాలి

ప్రముఖ కవి రసరాజు



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న రెంటాల వెంకటేశ్వరరావు, ఇంతియాజ్ అహ్మద్ తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సమాజాన్ని జాగృతం చేసే గొప్ప శక్తి కవిత్వానికి ఉందని ప్రముఖ కవి రసరాజు అన్నారు. విజయవాడ పుస్తక మహోత్సవంలో భాగంగా సాహితీవేత్త సరికొండ నరసింహారాజు కవితాసంపుటి 'తల్లడిల్లే తల్లివేరు'ను రసరాజు శనివారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చైతన్యపరిచే కవిత్వం రాయడంలో నరసింహారాజు మంచి ప్రతిభ కనబరిచారని అభినందించారు. విరసం రాష్ట్ర అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ, ఘంటా విజయకుమార్, కవి నరసింహారాజు, కార్యక్రమాల సమన్వయకర్త గోళ్ల నారాయణరావు, రచయితలు కూరపాటి కోటరాజు, కలిమిశ్రీ , గుమ్మా సాంబశివరావు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై విస్తృత చర్చ జరగాలి.

భారతదేశాన్ని మరింత ఆధునికంగా తీర్చిదిద్దేందుకు రాజ్యాంగంపై మరింత చర్చ జరగాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎం.గేయానంద్ అన్నారు. పుస్తక మహోత్సవం ప్రధాన వేదికపై ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు రచించిన 'భారత రాజ్యాంగం' పుస్తకాన్ని, రాం ప్రదీప్ రాసిన 'విస్మృత మహనీయులు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గేయానంద్ మాట్లాడుతూ.. రాజ్యాంగం ప్రజలకే సర్వాధికారాలు ఇచ్చిందనీ, హక్కులు, బాధ్యతలు అర్థమయ్యేందుకు లక్ష్మణరావు రచన ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. రచయిత లక్ష్మణరావు మాట్లాడుతూ.. ప్రస్తుతం రాజ్యాంగంలో ప్రతిపాదించిన మౌలిక విలువలు, సూత్రాల అమలు అనుమానాస్పదంగా మారిందని అభిప్రాయపడ్డారు.

సమాజ శాస్త్ర అధ్యయనానికి అండగా వేదాలు

సమాజ శాస్త్ర అధ్యయనానికి కావాల్సినంత సమాచారమంతా వేదాల్లో ఉందని రచయిత డాక్టర్ రెంటాల వెంకటేశ్వరరావు అన్నారు. పుస్తక మహోత్సవంలో భాగంగా విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ ముద్రించిన రుగ్వేద 'యధార్థ దర్శనం', 'వెలుతురు', 'స్వప్నసాగరం', 'ఈ గులాబీకి ముళ్లు లేవు' పుస్తకాలను శనివారం ఆవిష్కరించారు. రెంటాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. వేదాలు అపౌరుషేయాలు కానప్పటికీ వాటిలోని సౌందర్యాన్ని, ప్రకృతికి సంబంధించిన అవగాహననూ కాదనలేమన్నారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎండీ ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడుతూ.. కథా సౌందర్యానికి సంబంధించిన నియమాలను వివరిస్తూ, రసరాజు కథాసంపుటిలో ఆ లక్షణాలు ఉన్నాయని పేర్కొన్నారు. రచయిత డాక్టర్ గుజ్జు చెన్నారెడ్డి ఆంగ్ల సాహిత్య వికాస క్రమాన్ని వివరించారు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ సంపాదకుడు గడ్డం కోటేశ్వరరావు సభకు అధ్యక్షత వహించారు. డాక్టర్ గుమ్మా సాంబశివరావు 'వెలుతురు' పుస్తకాన్ని సమీక్షించారు. కవి, రచయిత రసరాజు మాట్లాడుతూ.. తన కథాసంపుటిలోని కథల విశేషాలను వర్ణించారు. డాక్టర్ తాటి శ్రీకృష్ణ మాట్లాడుతూ.. సాహితీకారులు తమ కాలం నాటి బాధితుల స్వరాన్ని ప్రతిఫలించాలన్నారు.



టెలిస్కోప్‌లో నక్షత్రాలను చూస్తున్న విద్యార్థులు

నేడు అనుమతి ఇలా..

విజయవాడ పుస్తక మహోత్సవం చివరి రోజైన ఆదివారం మధ్యాహ్నం 12 గంటల నుంచే సందర్శకులను ప్రాంగణంలోకి అనుమతిస్తారని సొసైటీ అధ్యక్షుడు కె.లక్ష్మయ్య తెలిపారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు సూచించారు. జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఆచార్య కట్టా సత్యప్రసాద్ రచించిన 'దాచేస్తే దాగని సత్యం – జీవపరిణామం' పుస్తకావిష్కరణ రతన్‌టాటా వేదికపై శనివారం సాయంత్రం జరిగింది. లక్ష్మణరావు మాట్లాడుతూ.. రచయిత జీవ పరిణామ క్రమానికి సంబంధించిన పలు అంశాలను చాలా చక్కగా ఈ పుస్తకంలో వివరించారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎం.గేయానంద్, సంస్థ ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు, సంస్థ ప్రముఖులు మురళీధర్, శివనాగేశ్వరరావు, త్రిమూర్తులు, జయప్రకాష్ ప్రసంగించారు. జనవిజ్ఞానవేదిక జిల్లా ఆధ్వర్యంలో ముద్రించిన డైరీని ఆవిష్కరించారు.